క్లుప్తంగా

పీడీ శ్రీరాములకు సన్మానం



శ్రీరాములను సన్మానిస్తున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు

శృంగవరపుకోట: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మల్కిపురంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని ధర్మవరం పాఠశాల పీడీ డాక్టర్ పి.శ్రీరాములు అబ్జర్వర్‌గా వ్యవహరించారు. పోటీల ముగింపు సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆయన్ని కోనసీమ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఏ.వి.శ్రీనివాస్, రిఫరీ పి.శ్రీనివాసరావు నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. పలు జిల్లాల అంపైర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, మేనేజర్లు శ్రీరాములు సేవలను అభినందించారు.

శబరిమలకు పాదయాత్ర



కాలినడకన శబరిమల వెళుతున్న ఒడిశా స్వాములను సత్కరిస్తున్న చీపురుపల్లి స్వాములు

చీపురుపల్లి: ఒడిశాలోని గుణుపూరు నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళుతున్న ముగ్గురు స్వాములకు చీపురుపల్లిలోని స్వాములు బుధవారం ఘనస్వాగతం పలికారు. కొద్దిరోజుల క్రితం గుణుపూరుకు చెందిన జవ్వాది వెంకటరమణ, ఉమ్మరవిల్లి శ్రీను, రాజేంద్ర బెహర అనే ముగ్గురు స్వాములు కాలినడకన శబరిమల యాత్రకు బయలుదేరారు. చీపురుపల్లి పట్టణం చేరుకున్న వారికి స్థానిక స్వాములు క్లాసిక్ రమణ, అప్పికొండ ఆదిబాబు, ఇప్పిలి తిరుమల స్వాగతం పలికి భిక్ష సదుపాయం కల్పించారు. అనంతరం వారిని శాలువలతో సత్కరించారు.

డాక్టర్ వరలక్ష్మికి సత్కారం



వరలక్ష్మిని సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, తహసీల్దార్ అరుణకుమారి

శృంగవరపుకోట: ఇటీవల గ్లోబల్ ఉమెన్ ఇన్‌స్పిరేషన్ సంస్థ పురస్కారం సాధించిన స్థానిక గైనకాలజిస్ట్ డాక్టర్ వరలక్ష్మిని మంగళవారం రాత్రి ఎన్‌జీఓ హోమ్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ సభ్యులు సన్మానించారు. అతిథులుగా హాజరైన తహసీల్దార్ అరుణకుమారి, రెడ్‌క్రాస్ సొసైటీ ఎస్. కోట బ్రాంచ్ వైస్ చైర్మన్ ఏ.మల్లేశ్వరరావు, రెడ్‌క్రాస్ డిస్ట్రిక్ట్ ఎంపీ మెంబర్ డి.సూర్యారావు, డాక్టర్ వి.ఎస్. అప్పలనాయుడు, జోగారావు మాస్టారు, జి.ధనుంజయ్ ఆమె సేవలను కొనియాడారు. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కాలువ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జేఈ చంద్రశేఖర్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగిలో మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో చేపడుతున్న సీసీ కాలువ నిర్మాణ పనులను పంచాయతీ రాజ్‌శాఖ జేఈ చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పనులను త్వరగా పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట స్థానిక నాయకుడు జమ్ము సతీష్ కుమార్, వార్డుమెంబర్ జి.కన్నారావు ఉన్నారు.

సులభంగా అర్థమయ్యేలా బోధించండి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ మానిక్యాలనాయుడు

గజపతినగరం: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని డీఈఓయు. మానిక్యాలనాయుడు ఉపాధ్యాయు లకు సూచించారు. పురిటిపెంట బాలుర హైస్కూల్‌ను బుధవారం ఉదయం ప్రార్థనా సమయంలో ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, ప్రార్థనాసమయానికి ఎంతమంది విద్యార్థులు వచ్చారన్న వివరాలను హెచ్‌ఎం వెంకటేశ్వరరావును ఆరా తీశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అంతకుముందు మరుపల్లి బాలాజీ పాలిటెక్నికల్ కళాశాలలో ఉపాధ్యాయులకు త్వరలో నిర్వహించనున్న శిక్షణ తరగతు లకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ విమలమ్మ, ఎంఈఓ–2 సాయిచక్రధర్ ఉన్నారు.

పీహెచ్‌సీకి సమస్యల సుస్తీ

- మెరకముడిదాం పీహెచ్‌సీలో బెడ్ల కొరత
- బెడ్‌షీట్లు , దిండ్లుకూడా లేని వైనం
- పనిచేయని వాటర్ ప్యూరిఫైయర్ ...
- ల్యాబ్‌లో పరికరాల కొరత



మెరకముడిదాం పీహెచ్‌సీ

మెరకముడిదాం: స్థానిక పీహెచ్‌సీలో సమస్యలు తిష్ట వేశాయి. సుస్తీ చేసిన రోగులకు వైద్యసేవలందించాల్సిన ఆస్పత్రికే సుస్తీ చేసిందా అన్నవందంగా పరిస్థితి తయా రైంది. నిత్యం రోగుల తాకిడి ఉండే ఈఆస్పత్రిలో కేవలం నాలుగు బెడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అవి కూడా పట్టి మంచాల మాదిరిగా ఉన్నాయే తప్ప వాటిపై పరుపులు, దిండ్లు లేవు. గతంలో ఈ ఆస్పత్రిలో పగటి పూట మాత్రమే సేవలందించే వారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీన్ని 24 గంటలు పని చేసే ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి సిబ్బందిని నియమించింది. అలాగే రూ.14 లక్షలతో భవనాల మరమ్మతులు, పెయింటింగ్స్, ఆస్పత్రి ప్రాంగణంలో టైల్స్ వేయడం, విద్యుద్దీకరణ వంటి పనులు చేశారు. అయినా ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయి. ల్యాబ్‌లో పూర్తిస్థాయిలో పరికరాలు అందుబాటులో లేకపోగా, డయేరియా విభాగంలో వసతుల లేమి వేధిస్తోంది. వాటర్ ప్యూరిఫైయర్ పాడవడంతో రోగులు తాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఆస్పత్రికి 108 అంబులెన్స్ కూడా లేదు. నిత్యం రోగులతో కిటకిటలాడే ఆస్పత్రిలో ఇన్ని సమస్యలు ఉన్నా అధికారులకు పట్టకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలని, బెడ్ల సంఖ్య పెంచాలని స్థానికులు కోరుతున్నారు.



ఆస్పత్రిలో బెడ్లు

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

ఆస్పత్రిలో ఆరుబెడ్లు ఉండాలి. కానీ నాలుగే ఉన్నాయి. బెడ్ షీట్లు, దిండ్లు లేని మాటకూడా వాస్తవమే. ఇంకా చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. బెడ్లు, బెడ్‌షీట్లు, వాటర్ ప్యూరిఫైయర్ కోసం ఇండెంట్ పెట్టాం.

– అజిత్‌బాబు, వైద్యాధికారి

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



ఎంపీపీ, జెడ్పీటీసీతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీలో బుధవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించి మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.5 లక్షల జిల్లా పరిషత్ నిధులు, రూ.10 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను, మేజర్ పంచాయతీలోని దేవాంగులవీధిలో రూ.5 లక్షల జిల్లా పరిషత్ నిధులు, రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే కొత్తగవిడివీధిలో రూ.5 లక్షల జిల్లా పరిషత్ నిధులతో సీసీ రోడ్డు, కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మం గళగిరి సుధారాణి, ఈఓపీఆర్డీ సురేష్, మేజర్ పంచాయతీ అధికారి ఝాన్సీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణ రాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దనరావు, ఇప్పిలి గోవింద, గవిడి సురేష్, ఇప్పిలి తిరుమల, కొంచాడ శ్రీనివాసకుమార్, సుబుద్ధి లక్ష్మణరావు, మల్లెంపూడి శ్రీను, దాలయ్య, గవిడి కల్కి, ప్రభాత్, రఘుపాత్రుని శివ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే పనులు చేపట్టాలి



ఎంపీడీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు, నాయకులు

మెరకముడిదాం: గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో మంజూరైన అభివృద్ధి పనులను సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే చేపట్టాలని మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ వద్దాది వెంకటరమణ మూర్తికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామసభల్లో తీర్మానించిన పనులను కాకుండా టీడీపీ నాయకులు చెప్పిన పనులను చేయించాలని చూడడం అధికారులకు తగదన్నారు. సర్పంచ్‌లను కాదని వెండర్ల పేరిట టీడీపీ నాయకులతో పనులు చేయించేందుకు ప్రభుత్వం జీఓను విడుదల చేయడం చట్టవిరుద్ధమన్నారు. సర్పంచ్‌ల హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు, బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన



కొత్తవలస: డిప్యూటీ తహసీల్దార్ హరికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు,ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



గజపతినగరం: ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళుతున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కొత్తవలస/గజతినగరం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల వల్ల విద్యారంగంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా(ఎస్‌ఎఫ్‌ఐ)నాయకులు కోరారు. కొత్తవలస, గజపతినగరం మండల కేంద్రాల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పలు కళాశాలల విద్యార్థులు బుధవారం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి అక్కడ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా జాయింట్ కార్యదర్శులు కె.రమేష్, శిరీష మాట్లాడుతూ విద్యాదీవెన, వసతిదీవెన బకా యిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని, డిగ్రీలో హానర్స్ విధానం రద్దు చేయాలని, వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, మెస్ చార్జీలు పెంచాలని, మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేసే ఆలోచన మానుకోవాలని, తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని కోరారు. గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంతభవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడు తున్నారని అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 6వ తేదీన ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నామని, విద్యార్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కొత్తవలసలో డిప్యూటీ తహసీల్దార్ పప్పు హరి, గజపతినగరంలో తహసీల్దార్ రత్నకుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కార్తీక్, చరణ్, అను, రత్న, గణేష్, జయ,స్వాతి,లక్ష్మి,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం పడిగాపులు



బొడసింగిపేటలోని గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన మహిళలు

బొండపల్లి: ఉచిత గ్యాస్ పథకంలో భాగం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం దీపావళి నుంచి తొలివిడత పంపిణీకి శ్రీకారం చుట్టింది. అయితే ప్రభుత్వం పెట్టిన నిబంధనల వల్ల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్యాస్ బుకింగ్ నెంబర్‌కు లబ్ధిదారు ఆధార్, బ్యాంకు ఖాతా నెంబర్ అనుసంధానం అయ్యేలా ఈకేవైసీ చేయించుకోవాలనే నిబంధన పెట్టారు. దీంతో మహిళలు గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. ఈకేవైసీ చేయించుకునేందుకు బోడసింగిపేట వద్ద శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీకి నాలుగు రోజులుగా వందలాది మంది మహిళలు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు. పనులు మానుకుని గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరగాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ పథకం అమలు చేసినా, వలంటీర్లు ఇళ్ల వద్దకు వచ్చి దరఖాస్తు చేయించడం, ఈకేవైసీ వంటి పనులు చేసేవారని గుర్తు చేసుకుంటున్నారు.

దీపావళి సంబరాలు



శృంగవరపుకోట: ఎస్.కోటలోని కౌముది గ్లోబల్ స్కూల్‌లో సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలకు హాజరైన విద్యార్థులు దీపావళి



శృంగవరపుకోట: ఎస్.కోటలోని ఎస్.జి.వి.నికేతన్ స్కూల్‌లో లక్ష్మీపూజ చేస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో దీపావళి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలకు హాజరయ్యారు. రంగవల్లులు వేసి వాటిలో దీపాలు, కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం లక్ష్మీపూజ చేశారు. మతాబులు, బాణ సంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

సోంపురం హైస్కూల్‌లో...

వేపాడ: సోంపురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.పి.ఏ.రాజు ఆధ్వర్యంలో బుధవారం దీపావళి సంబరాలు నిర్వహించారు. 3,4,5 తరగతుల విద్యార్థులు ప్రదర్శించిన నరకాసురవధ నాటకం ఆకట్టుకుంది. దీపావళి పండగ విశిష్టతను, బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమేష్‌నాయుడు, సన్యాసిరావు వివరించారు.



వేపాడ: సోంపురం హైస్కూల్‌లో వివిధ వేషధారణలతో విద్యార్థులు

జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ జి.ఏ.వి.రమణ

గజపతినగరం: దీపావళి సందర్భంగా ప్రజలు బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని స్థానిక సీఐ జి.ఏ.వి.రమణ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారంఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎటువంటి ప్రమాదాలకు తావివ్వకుండా ప్రజలు సంతోష వాతావరణంలో పండగ జరుపుకోవాలని అన్నారు. టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలని, నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ అవసరమన్నారు. పోటీపడి బాణసంచా కాల్చినా, ఆకతాయి పనులు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

• రోడ్డుపై జలకాలాట





వేపాడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఎక్కడికక్కడ గోతులు తేలింది. రోడ్డుకు ఇరువైపులా కాలువ లేకపోవడంతో స్థానికులు వినియోగించే వాడుక నీరు రోడ్డుపై గోతుల్లో చేరుతోంది. ఇలా ఓ గుంతలో చేరిన నీటిలో బుధవారం ఓ గేదె సేదతీరుతూ ఎంత హాయి అన్నట్లు జలకాలాడుతూ కనిపించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేపాడ మండలంలోని సోంపురం నుంచి అనకాపల్లి జిల్లాలోని ఆనందపురం వరకు రోడ్డు విస్తరణ చేశారు. ఎన్నికలకు ముందే తారు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో వేపాడ, వల్లంపూడి, అరిగిపాలెం, సోంపురం గ్రామాల్లో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. సైడ్ కాలువలు లేకపోవడంతో ప్రజల వాడుక నీరు ఇలా రోడ్డుపై గుంతల్లో చేరుతుండడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

– వేపాడ

• అల్లుకున్న నిర్లక్ష్యం





కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లి ఫ్లైఓవర్ వద్ద విద్యుత్ స్తంభం, చింతలపాలెం గ్రామం మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ని చూస్తే విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. స్తంభాలకు పిచ్చి పాదులు, తీగలు అల్లుకున్నాయి. చాలా గ్రామాల్లో ఈ సమస్య ఉంది. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం విద్యుత్ సరఫరాలో అంతరాయానికి, ప్రమాదాలకు కారణమవుతోంది. స్తంభాలను అల్లుకున్న పాదులు,తీగలు మేసేందుకు వెళుతున్న మూగజీవాలు, ఆవులు విద్యుత్ షాక్‌కు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. విద్యుత్ లైన్లను అనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల పేరిట ప్రతీ శుక్రవారంవిద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. అయినా ఎక్కడికక్కడ స్తంభాలపై ఇలా పాదులు, తీగలు దర్శనమిస్తున్నాయి.

– కొత్తవలస

• జంగిల్ క్లియరెన్స్ చేయరూ..



లక్కవరపుకోట మండల కేంద్రం నుంచి ఖాసాపేట,తలారి, కొట్యాడ మీదుగా అలమండ సంత జంక్షన్‌కు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, డొంకలు విపరీ తంగా పెరిగిపోయాయి. దీంతో మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈరోడ్డులో నిత్యం వందలాది వాహ నాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో ప్రతీ ఏడాది వర్షాకాలం నాటికి రోడ్డు నిర్వహణలో భాగంగా తుప్పలను తొలగించేవారు. ఈఏడాది ఆర్అండ్‌బీ అధికారులు ఆ పనులు చేపట్టలేదు.

సేవలే గుర్తింపునిస్తాయి



లక్కవరపుకోట: ఉపాధ్యాయుడు పార్వతీశం దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ, తదితరులు

వేపాడ: ఏ ఉద్యోగికైనా విధినిర్వహణలో చేసిన సేవలే తగిన గుర్తింపునిస్తాయని జెడ్పీటీసీ ఎస్.అప్పారావు అన్నారు. వల్లంపూడి ప్రాథమిక పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయిని గుత్తి లక్ష్మి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, ఆమెను ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ఉపాధ్యాయిని లక్ష్మి అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ గ్రామస్తుల మన్ననలు పొందారన్నారు. వేపాడ,వల్లంపూడి గ్రామపెద్దలు గుమ్మడి భారతి, శ్రీను పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు పాలూరికి సన్మానం

లక్కవరపుకోట: గొల్జాం ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసిన పాలూరి పార్వతీశం బుధవారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో సహోపాధ్యాయులు ఆయన్ని సన్మానించారు. అతిథిగా హాజరైన ఎంఈఓ సీహెచ్.కూర్మారావు మాట్లాడుతూ పార్వతీశం అంకిత భావంతో పని చేసి, ఉపాధ్యాయ వృత్తికే ఔన్నత్యం తెచ్చారని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏ.సదాశివరావు, ఎమ్మెల్సీ రఘువర్మ, ఎంఈఓ–2 శ్రీనివాసరావు, హెచ్‌ఎం జి.సుదర్శన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రుద్రాభిషేకం



ఓం సదనం ఆశ్రమంలో 108 శివ లింగాలకు రుద్రాభిషేకం చేస్తున్న ఉమామహేశ్వరశర్మ

కొత్తవలస: తుమ్మికాపల్లి గేటు సమీపంలోని ఓం సదనం ఆశ్రమంలో వేదపండితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో 108 శివలింగాలకు బుధవారం రుద్రాభిషేకం నిర్వహించారు. పలువురు అయ్యప్ప,శివ మాలధారణ భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



లింగంపేట భీమలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

లింగంపేటలో..

లక్కవరపుకోట: లింగంపేటలోని భీమలింగేశ్వస్వామి ఆలయంలో పురోహితులు ఏ.శ్రీహరిశర్మ ఆధ్వర్యంలో బుధవారం రుద్రాభిషేకం నిర్వహించారు. పూజల్లో గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

బొండపల్లి: సాలూరు వైపు నుంచి కూరగాయల లోడ్‌తో విజయనగరం వెళుతున్న వ్యాన్ మండంలోని బోడసింగి వద్ద జాతీయ రహదారి–26పై బుధవారం వేకువ జామున అదుపు తప్పి బోల్తా పడింది. వ్యాన్‌లోని కూరగాయలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడి పోయాయి. డ్రైవర్ వ్యాన్ నుంచి గెంతేయడంతో గాయాలు కాకుండా తప్పించుకున్నాడు.

సంక్షిప్తంగా...

వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండలంలోని కె.ఎస్.ఆర్.పురంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో బుధవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 60మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గృహసందర్శన చేసి వృద్ధులు, బెడ్ రెస్ట్ రోగులకు వైద్యసేవలందించారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్

వేపాడ: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల చాలవరకు వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ఈఓపీఆర్డీ రవికుమార్ అన్నారు. మండలంలోని బొద్దాం గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. వీధుల్లో అక్క డక్కడా పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. పరిశుభ్రత పాటించాలని,రోడ్లపై, కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత పారబోయవద్దని, డస్ట్‌బిన్‌లను వినియోగించాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి భారతి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్య పనులు



పాతశ్రీరంగరాజపురంలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ కామునాయుడు

గజపతినగరం: మండలంలోని కెంగువ,సీతారామపురం,పాతశ్రీరంగరాజపురం,కొత్తశ్రీరంగరాజపురం,మరుపల్లి తదితర గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సర్పంచ్‌లు సూచించారు.

తాగునీటి పైపుల పరిశీలన

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి, కె.కొత్తవలస, మరడాం గ్రామాల్లో తాగునీటి పైపు లైన్లను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కార్తీక్ బుధవారం పరిశీలించారు. పైపులైన్లకు లీకులు ఏర్పడడం వల్ల తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గతంలో చేపట్టిన జాతీయ రహదారి పునరుద్ధరణ పనుల వల్ల కల్వర్టుల కింద ఉన్న పైపు లైన్ పూర్తిగా పాడవడంతో తాడేందొరవల సకు కొంత కాలంగా తాగునీరందడం లేదని, త్వరలో పైపులైన్ పనులు చేసి తాగునీటి సరఫరా పునఃప్రారంభిస్తామని జేఈ చెప్పారు.